: అనంతపురం కలెక్టరేట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

బాబ్బాబు..మీకేం కావాలి..?



◆ ఎన్నికలు సమీస్తున్న వేళ కార్యకర్తలకు తాయిలాలు

◆ స్థలాలు చూసుకోండి.. భూ పంపిణీలో మీకూ ఇస్తాం..!

◆ మద్దతుదారులను ప్రసన్నం చేసుకునే పనిలో అధికార పార్టీ నేతలు

ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ వేడి మొదలైంది. 2024 ఎన్నికలకు సన్నద్ధం అయ్యేలా అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పటి నుంచే ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాయి. గెలుపే లక్ష్యంగా అందరినీ ప్రసన్నం చేసుకునే పనిలో నాయకులు పడ్డారు. అధికార పార్టీలో ఈ ప్రక్రియ ఎక్కువగా కన్పిస్తోంది. ఎందుకంటే అధికారం ఉండి కూడా ఈ నాలుగేళ్లలో తామేమీ లబ్ధిపొందలేదనే భావన ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో అభ్యర్థులకు వీరు సహకరించే విషయంలో కూడా సందిగ్ధం నెలకొంది. దీంతో అధికార పార్టీ నేతలు ఆయా గ్రామాల వారీగా ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నం అయ్యారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికార వైసిపిలో కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులను ప్రసన్నం చేసుకునే పనులు ప్రారంభమయ్యాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12, రెండు పార్లమెంటు స్థానాల్లోనూ వైసిపి గెలుపొందింది. మొదటి సారి ఆ పార్టీ అధికారంలోకి రావడంతో ద్వితీయశ్రేణి నాయకులు వారి భవిష్యత్తుపై చాలానే ఆశలు పెట్టుకున్నారు. అయితే వైసిపి అధికారం చేపట్టినా ద్వితీయ శ్రేణి, కార్యకర్తలను ముఖ్య నేతలెవరూ పట్టించుకోలేదన్న భావన కింద స్థాయి నేతల్లో ఉంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలోనూ పలుమార్లు నాయకులు, ముఖ్య నేతల తీరును కార్యకర్తలు ఎత్తిచూపారు. వారు ఏ రకంగా సంపాదించుకుంటున్నారో కూడా తెలియజేశారు. ఈ సమీక్షలు తరచూ జరుగుతుండటంతో కొంతమంది ఎమ్మెల్యే, ముఖ్య నాయకుల పట్ల అధిష్టానం కూడా సీరియస్‌గానే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏదో రకంగా అసంతృప్తితోనున్న వారిని తమ దారికి తెచ్చుకునేందుకు ముఖ్య నేతలు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. అందరినీ పిలిచి ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. ఏమి కావాలో అడిగి తెలుసుకుని వాటిని చేసే పెట్టే పనుల్లో కొంత మంది నేతలు నిమగ్నమయ్యారు. ఇందులో అనంతపురం, సత్యసాయి జిల్లా పరిధిలోనున్న ఒక నియోజకవర్గ నాయకులు ఆయనకు సమయం దొరికనప్పుడల్లా పంచాయతీల వారీగా నేతలను పిలిపించి వారి సమస్యలు వినడం, ఏమి చేయాలని అడగటం జరుగుతోంది. వాటిని పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటున్నట్టు కూడా హామీలిస్తున్నారు. జిల్లా కేంద్రంలో మకాంవేసి ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టి అసంతృప్తులను తిరిగి బుజ్జగించే పనిని చేపట్టారు. ఇంకో నియోజక వర్గంలో ప్రభుత్వం పంపిణీ చేయనున్న భూ పంపిణీలో వారికి కేటాయించాలని అధికారులకు ఆదేశాలిస్తున్నారు. అదే విధంగా విలువైన చోట ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి ఒక్కొక్కరి రెండు నుంచి మూడు సెంట్ల వరకైనా ఇంటి స్థలాన్ని కేటాయించాలని అధికారులకు ఇప్పటికే మౌఖిక ఆదేశాలిచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు అన్ని నియోజక వర్గాల్లోనూ భూ పంపిణీలోనే అసంతృప్తు లను సంతృప్తి పరిచే చర్యలు చేపట్టారు.

అభివృద్ధి పనులు తీసుకునేందుకు వెనుకడుగు..!

వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చేసుకోమంటే చేసుకోవడానికి కార్యకర్తలే వెనుకడుగువేస్తున్నారు. బిల్లులు సకాలంలో రాకపోతే ఇబ్బందులు పడుతామన్న ఉద్దేశంతో పనులు తీసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అది కూడా గతంలో 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు ఈ రకంగా పనులు చేసి బిల్లులు రాక ఇప్పటికీ ఇబ్బందులు పడుతుండటం చూసి వీరు పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా భూములు అవి కాకుండా ఇసుక, మట్టిని విక్రయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రకంగా ఎన్నికలకు ముందు కార్యకర్తలకు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చి తిరిగి ఎన్నికల్లో పనిచేయించుకునే ఆలోచన ముఖ్య నేతలు చేస్తున్నారు. దీంతో ఆ నేతల ఇళ్ల వద్ద ఇటీవల నిత్యం రద్దీ

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలంలోని వెంకటాంపల్లి, కుందుర్పి మండలంలోని బండమీదపల్లి గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఆహార శుద్ధి ప్రాజెక్టులను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం రూ.1,719 కోట్లతో తలపెట్టిన 11 ఆహార శుద్ధి ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం మండలం వెంకటాంపల్లి, కుందుర్పి మండలంలోని బండమీదపల్లి గ్రామాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను ప్రారంభించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఈ కార్యక్రమంలో కలెక్టర్ యం.గౌతమి, ఎఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో కలెక్టర్ గౌతమి మాట్లాడారు. అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన ఆహార శుద్ధి ప్రాజెక్టుల ద్వారా టమోటా సాగు చేసే రైతులు, ఇతర కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసే రైతులు దాదాపు 60 వేల మంది లబ్ధి పొందనున్నారని తెలిపారు. ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో 2 ఎఫ్‌ఒలు ఏర్పాటు చేసుకుని ప్రాసెసింగ్ సెంటర్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు ఎకాలజీ సెంటర్ ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లాలో ఏర్పాటు చేసే ఒక్కో ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ (పిపిసి) కోసం రూ.5.50 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం పలువురు రైతులు ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రఘునాథ రెడ్డి, ఎపిఎంఐపి పీడీ ఫిరోజ్ ఖాన్, ఫిషరీష్ డిడి శాంతి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నాగరాజ్, కళ్యాణదుర్గం ఎంపీపీ మారతమ్మ, జెడ్పీటీసీ బొమ్మన్న పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, అధికారులు

అక్టోబర్ నుంచి కిసాన్ డ్రోన్స్ పంపిణీ

రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హరికిరణ్

ప్రజాశక్తి-అనంతపురం

అక్టోబర్ నెలలో కిసాన్ డ్రోన్స్ పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హరికిరణ్ తెలిపారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారులతో రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హరికిరణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఈపంట నమోదుపై మండల స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ మాసంలో కిసాన్ డ్రోన్స్ పంపిణీ చేయనున్న నేపథ్యంలో పైలట్ ట్రైనింగ్ ఇచ్చేందుకు రైతులను గుర్తించాలన్నారు. అదేవిధంగా పి.ఎం కిసాన్ ఇకెవైసిని పూర్తి చేయాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులను నిల్వ చేసి రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, పద్మజ, గురుమూర్తి, యల్లప్ప, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

హౌసింగ్ డిఇ శ్రీమన్నారాయణ

ప్రజాశక్తి-నార్పల

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ఆగస్టు 15వతేదీలోపు పూర్తి చేయాలని హౌసింగ్ డిఇ శ్రీమన్నారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ దివాకర్ అధ్యక్షతన గృహ నిర్మాణం, ఇతర పథకాలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతకు ముందు ఇళ్లు మంజూరై క్షేత్రస్థాయిలో వారి పేరుతో ఇళ్లు లేకపోయినా, పొరపాటుగా గృహ నిర్మాణం జరిగినట్లుగా ఉంటే వారి వివరాలను సేకరించాలన్నారు. పిఎంఎవై ద్వారా ఇళ్లు నిర్మించుకున్న వారికి మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ పథకం సర్వే పూర్తయిందని, దీన్ని పరిశీలించడానికి కేంద్ర కృందం గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తోందన్నారు. వారు పంచాయతీల్లో ఎఎస్‌డబ్ల్యుపిసి షెడ్యూల్ నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, ప్రభుత్వ పాఠశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం వంటివాటిని పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ కొండభూషణ, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎపిఒ ఎర్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు కొడుతున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి వార్తకు స్పందన

బెస్తరపల్లిలో వైద్యశిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో వైద్యసిబ్బంది మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 'బెస్తరల్లిలో విషజ్వరాలు' అనే శీర్షికతో మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితం అయిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన అధికారులు గ్రామానికి చేరుకుని దోమల మందు ఫాగింగ్ చేశారు. ఇందులో భాగంగా 43 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ ప్రజల తమ ఇళ్ల ముందు నీటిని నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మమతా ధనంజయ, వైద్యాధికారి డాక్టర్ సోమేశ్‌కుమార్, తాలూకా మలేరియా అధికారి తిరుపాలయ్య, పంచాయతీ కార్యదర్శి హరీష్, వైసిపి సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి : డీఎస్పీ

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ గంగయ్య సూచించారు. సమస్యాత్మక గ్రామాలైన తలారి చెరువు, ఊరుచింతల గ్రామాల్లో డీఎస్పీ మంగళవారం పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహర్రం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. పండుగ సమయంలో ఏవైనా గొడవలకు ప్రేరేపిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ గౌస్ మహమ్మద్, రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ గంగయ్య

మంత్రి ఫొటోకు పసుపు పూసి పూలు, చీర పెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న జనసేన వీరమహిళలు

మంత్రి వ్యాఖ్యలపై జనసేన నిరసన

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి జోగి రమేష్ ఓ కొజ్జా అని చిత్రపటానికి పసుపు రాసి చీర, గాజులు పెట్టి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నగర కార్యదర్శి సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, విధివిధానాలపై ప్రశ్నించిన పవన్‌కల్యాణ్‌పై మంత్రి జోగి రమేష్ అనుచితంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఈ వ్యాఖ్యలు చేస్తుంటే సిఎం జగన్ చిరునవ్వులు చిందించడం విడ్డూరంగా ఉందన్నారు. మంత్రి వెంటనే పవన్‌కల్యాణ్‌కు క్షమాపణ చెప్పాలని, లేకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

హింసలేని సమాజాన్ని నిర్మించుకుందాం

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు, హింస పెరిగిపోతోందని ఇలాంటి పరిస్థితుల్లో హింసలేని సమాజాన్ని నిర్మించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపాలని ఐద్వా ఆధ్వర్యంలో బిసి బాలికల వసతిగృహంలో విద్యార్థినులతో మంగళవారం ఉదయం సెమినార్ నిర్వహించారు. ఐద్వా బాలికల వసతిగృహం వార్డెన్ శిరీష అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలపై రోజురోజుకూ హింస పెరిగిపోతోందన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధ వరకు అందరూ దాడులకు, అత్యాచారాలకు గురవుతున్నారని తెలిపారు. దేశంలో ఇటీవల మణిపూర్‌లో జరిగిన మారణహోమం వంటి సంఘటన మునుపెన్నడు జరగలేదన్నారు. మానవ సమాజం సిగ్గుపడే అంతలా అక్కడ దారుణాలు చోటు చేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల్ని వివస్త్రలను చేసి నగ్నంగా ఊరేగించి అత్యాచారం హత్య చేయడం మానవ సమాజానికే మాయని మచ్చ అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి సాధించామని ఆనందపడాలో అదే సాంకేతికత, ఇంటర్‌నెట్‌ను అనవసర అంశాల పట్ల వినియోగించి ఇలా మహిళల్ని, పిల్లలను ఇబ్బందులు, హత్యలు చేస్తున్నందుకు ఆందోళనపడే దుస్థితి ఏర్పడుతోందన్నారు. విద్యార్థినులు సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచులతో మాట్లాడటం, పరిచయాలు పెంచుకోవడం వంటివి చేయరాదన్నారు. ఇంటర్‌నెట్‌ను చదువులు, అభ్యున్నతి కోసం మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను సాధించేందు విద్యార్థినులు బాగా చదువుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి బాలికల హాస్టల్ వార్డెన్ రాజేశ్వరి, ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, జిల్లా ఉపాధ్యక్షులు రామాంజినమ్మ, సిబ్బంది పుష్ప, భారతి, హేమలత, సుజాత, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న రమాదేవి

మణిపూర్ మారణహోమాన్ని ఆపాలి

మణిపూర్‌లో జరుగుతున్న అవమానవీయ సంఘటనలు, మారణహోమాన్ని ఆపి, శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. మంగళవారం నాడు అనంతపురంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో జరిగిన సంఘటన దేశానికే సిగ్గుచేటుగా ఉందన్నారు. ఇద్దరు మహిళల్ని నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్య చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. మణిపూర్‌లో ఇంత మారణకాండ జరుగుతున్నా ప్రధాని నరేంద్రమోదీ మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. మే 4న ఘటన జరిగితే ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదన్నారు. ఈ వీడియోలు రెండు నెలల తరువాత సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి వచ్చాయన్నారు. మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించిన తరువాత ప్రధాని నామమాత్రపు విచారం వ్యక్తం చేశారన్నారు. దేశానికి రక్షణగా పని చేసిన సైనికుడి కుటుంబానికే అక్కడ రక్షణ లేకుండా పోయిందన్నారు. స్వాతంత్ర్య సమరయోదుడి భార్యను ఇంటితో సహా దహనం చేశారంటే అక్కడి పరిస్థితులు ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. దేశంలో ఇలాంటి మారణకాండ జరిగినా నియంత్రించలేని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి అధికారంలో ఉండేందుకు అర్హత లేదన్నారు. రాబోయే రోజుల్లో మణిపూర్ మారణకాండ దేశమంతా అంటుకునే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రజలందరూ అప్రమత్తం కావాలన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధనాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విద్వేషాలు లేని సమాజం, హింస లేని సమాజం నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కోరారు.

పనుల అంచనాల తయారీలో జాప్యం

◆ సచివాలయాలకు మంజూరు కాని నిధులు ◆ గ్రామాల్లో సమస్యల తిష్ట ◆ అయోమయంలో సర్పంచులు

గుంతకలమయం అయిన రోడ్డు

నిధులు లేక గ్రామంలో ఆగిన పైప్‌లైన్ పనులు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

గ్రామ పంచాయతీల నిధులను ప్రభుత్వం ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు ఎన్నికైనప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం 14వ ఫైనాన్స్, 15వ ఫైనాన్స్ పంచాయతీ నిధులను ఇతర పథకాలకు మళ్లించడం మొదలుపెట్టింది. దీంతో గ్రామాల్లో తాగునీటి పైపులైన్లు, మోటార్ల మరమ్మతులు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, పారిశుధ్యం నిర్వహణ, విద్యుత్, తదితర మౌలిక వసతులు కల్పించేందుకు కూడా నిధులు లేక సర్పంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల సర్పంచులే సొంత నిధులతో ఆయా పనులు చేయించినా ఆ తర్వాత బిల్లులు మంజూరు కాక తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల సర్పంచులు విజయవాడలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించడం ఫలితంగా 15వ ఫైనాన్స్‌లో మూడో క్వార్టర్ నిధులు విడుదలయ్యాయి. అందులోనూ విద్యుత్ బకాయిలు, ఎల్ఈడి బల్బుల బకాయిలు కలిపి 60 శాతం కోత విధించింది. ఆ మిగిలిన సొమ్మైనా పంచాయతీ ఖాతాల్లో జమ చేసిందా అంటే ప్రకటనలకే పరిమితమైంది. అయితే "గడప గడపకూ మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సచివా లయానికి రూ. 20 లక్షలు మంజూరు చేసింది. గుంతకల్లు మండలంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం(జనవరిలో) ప్రారంభించి ఆరు నెలలు కావస్తున్నా ప్రభుత్వం కేటాయించిన నిధులు ఒక్క సచివాలయానికి కూడా నయా పైసా మంజూరు కాలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు మౌలిక వసతులు కల్పించే పనుల అంచనాలు పంపించకపోవడంతో ఒక్క పైసా కూడా ఆయా సచివాలయాలకు రాలేదు. ములకలపెంట, వెంకటంపల్లి, చింతలంపల్లి, తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. వైటి చెరువు గ్రామానికి ఉన్న రెండు లింకు రోడ్లు అధ్వానంగా ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామాల్లో డ్రైనేజీ, రోడ్లు లేకపోవడం వల్ల పారిశుధ్యం పడకేసింది. కొళాయిలకు ట్యాప్‌లు బిగించే స్తోమత లేక తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. గుండాలతండా గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో కట్టెల పైనే విద్యుత్ తీగలు చుట్టి కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా గ్రామాల్లో పలు సమస్యలు తిష్ట వేశాయి. ఇకానైనా అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలకు సంబంధిం చిన పనులకు అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని పంచాయతీ సర్పంచులు కోరుతున్నారు.

నిధుల మంజూరులో ఆలస్యం వాస్తవమే

'గడప గడపకూ మన ప్రభుత్వం' ప్రారంభించి చాలా రోజులైంది. అయితే అధికారులు సకాలంలో ఎస్టిమేషన్లు వేయక పోవడం వల్ల నిధుల మంజూరులో ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. ఎస్టిమేషన్లు పంపిన మూడు రోజుల్లోపు నిధులు మంజూరవు తాయన్నారు. ఇప్పటివరకు ఎలక్ట్రికల్ ఏఈ తప్ప ఇంకెవరూ ఎస్టిమేషన్‌లు పంపకపోవడం వల్ల సమస్య ఉత్పన్నమైంది. పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

వెంకటరమణ, ఎంపిడిఒ.

మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ - జిల్లాలో కొనసాగిన ఆందోళనలు

అనంతపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు, ప్రజాసంఘాల నాయకులు,

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో ఘటనలను నిరసిస్తూ సిఐటియు, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. లలిత కళాపరిషత్ నుంచి ప్రారంభమైన ర్యాలీ క్లాక్ టవర్ మీదుగా మహాత్మా గాంధీ విగ్రహం వరకూ సాగి అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డొల్లతనం వల్లే మణిపూర్‌లో మహిళలపై దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయన్నారు. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం, సామూహిక అత్యాచారానికి పాల్పడటం హేయమైన చర్యల అన్నారు. అంతేగాకుండా మణిపూర్ తగలబడిపోతుంటే ప్రధాని మోదీ విదేశీ పర్యటనలు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమై ప్రధాని జోక్యం చేసుకుని మణిపూర్‌లో పరిస్థితిని అదుపులోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూర్యనారాయణ, సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, సిఐటియు నగర కార్యదర్శులు ముత్తూజ, వెంకటనారాయణ, బత్తల ఆదినారాయణ, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, తిరుమలేష్, లక్ష్మీనరసమ్మ, మరియమ్మ, లక్ష్మీనారాయణ, గుర్రాజు, బాబు, భగత్‌సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, ఆదినారాయణ, గఫూర్, లింగారెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు, హింసను అరికట్టాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు బి.జ్యోతి డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 28 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఐద్వా ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సుయాత్రకు సంబంధించిన కరపత్రాలపు మంగళవారం పట్టణంలోని సిఐటియు కాలనీలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. మనువాద భావజాలాన్ని అంతం చేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్‌లను నిషేధించాలన్నారు. మణిపూర్ ఘటనల నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అదేవిధంగా బస్సుయాత్రను జయప్రదం చేయడంతోపాటు ఆగస్టు 8న అమరావతిలో నిర్వహించనున్న బహిరంగ సభకు మహిళలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కమిటీ సభ్యులు శశికళ, లావణ్య, శాంతి, సుగుణ, రజియా, విజయ, సరోజ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మణిపూర్‌లో జరిగిన మతోన్మాత విధాదాన్ని నిరసిస్తూ క్రైస్ట్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్, పాస్టర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఉరవకొండలోని ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

గుంతకల్లులో కరపత్రాలు విడుదల చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు, మహిళలు

మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేస్తూ అత్యాచారం చేయడం బాధాకరమన్నారు. వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్కడి నుంచి ఉరవకొండ అర్బన్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిఐ హరినాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. వీరికి దళిత గిరిజన హక్కుల సాధన సమితి అధ్యక్షులు గోపాల్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవులు, మైనారిటీలు, దళిత గిరిజన హక్కుల సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గం : మణిపూర్ ఘటనలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని వినాయక కూడలిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాయదుర్గం తాలూకా కార్యదర్శి గురుస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్రేష్, తిప్పేస్వామి, నరసింహులు, దుర్గన్న, నాగరాజు, రాజశేఖర్, అంజి, అభి, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీవెంకటేశ్వర వైభవం' వీడియో విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న శ్రీ-7 కన్వెన్షన్ హాల్‌లో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న శ్రీ వెంకటేశ్వర వైభవం కార్యక్రమానికి సంబంధించిన వీడియోను కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.గౌతమి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుమలలో వైకుంఠవాసునికి జరిగే సేవలన్నింటినీ ఒకరోజు అనే పేరుతో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని కోరారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ మాట్లాడుతూ 28న ఊంజలసేవ, అష్టదల పద్మార్చన, సహస్ర దీపాలంకరణ, పవళింపు సేవలు, 29న తెల్లవారుజామున సుప్రభాత సేవ, స్థాపన తీరుమంజనం, పుష్పయాగం, తోమాలసేవ, తిరుప్పడ సేవ, కల్యాణోత్సవం, పవళింపు సేవలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెంకటేశ్వర వైభవం వీడియోను విడుదల చేస్తున్న కలెక్టర్ గౌతమి

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి-నార్పల

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని గూగూడు కుళ్లాయి స్వామిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ కార్యకారి నిర్వహణ అధికారిణి శోభ, పాలకవర్గం చైర్మన్ శివశంకర్‌రెడ్డి, సర్పంచి రమణకుమారి, తదితరులు ఎమ్మెల్యే దంపతులను శాలువతో సత్కరించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై కార్యనిర్వహణ అధికారిణి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, ఎంపిడిఒ దివాకర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, మండల కో ఆప్షన్ సభ్యురాలు సాబీర, ఎంపిటిసి రాజారెడ్డి, శివయ్య, గుంజేపల్లి, శివారెడ్డి, దుగుమర్రి వీరనారాయణరెడ్డి, రాజశేఖర్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి దంపతులు, కుమారుడు విరాట్ రెడ్డి

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

గుత్తి : మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డు సమీపంలో ఉన్న ఎటిఎం గార్డు శేఖర్ రెండు నెలల క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు సేకరించిన రూ.40 వేల మొత్తాన్ని శేఖర్ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డోన్ ఎంవిఐ క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్ రమేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

In the Court of the IIIrd Addl. Junior Civil judge (Excise Court): Ananthapuramu

O.S.No:64/2023

Between:

D.Vijaya Bharathi ...Plaintiff

And

Balireddygari Chennareddy (died by his only son) B.C. Rama Krishna Reddy ...Defendant

NOTICE TO DEFENDANT

To,

B.C. Rama Krishna Reddy S/o Late B.Chenna Reddy, R/at D.No.6/452-B2, Kovvuru Nagar, Ananthapuramu.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 28-08-2023వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఆలూరు రాఘవేంద్ర, అడ్వకేట్
అనంతపురం, సెల్: 9440181500.

మహారాజశ్రీ గుత్తి సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

O.S.188/2015

Between:

Y.Lakshimidevi & others ...Plaintiffs

V/s

Y.Ramanna died and his L.Rs ...Defendants

2వ ప్రతివాదికి నోటీసు

D2: Y.Obulesu S/o Late Y.Ramanna R/at D.No.10/200, Near Z.P. Urdu High School, Gooty Town, Ananthapuramu District.

పై నెంబరు దావాలో 2వ ప్రతివాది అయిన మీపై పైన పేర్కొన్న వాదులు ఆస్తుల భాగపరిష్కారం నిమిత్తం పై కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. మీరు కోర్టు నుండి వచ్చిన నోటీసులను తీసుకొనక నిర్లక్ష్యం వహిస్తున్నారు. కావున ఇందుమూలముగా తెలయజేయడం ఏమనగా నీ యొక్క హాజరు నిమిత్తం 02-08-2023వ తేదీన వాయిదా వేసినారు. కావున నీవు స్వతహాగా గానీ, నీ తరపున వకీలు ద్వారా గానీ ఉదయం 10.30 గం॥లకు పై తెల్పిన కోర్టునందు హాజరుకావలయును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

కె.శ్రీనివాసులు, ఎన్.ఎం. చౌడేశ్వరయ్య
అడ్వకేట్స్, గుత్తి.

కిమ్స్ సవీరా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మెడలో రక్తనాళానికి స్టెంట్

ఆపరేషన్ వివరాలను వెల్లడిస్తున్న సవీరా వైద్యులు సందీప్

ప్రజాశక్తి-అనంతపురం

మెడ దగ్గర ఉండే రక్తనాళం పూర్తిగా పూడుకుపోవడంతో మెదడుకు రక్తసరఫరా తగ్గిపోయి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వృద్ధురాలికి అనంతపురంలోని కిమ్స్ సవీరా వైద్యులు సకాలంలో గుర్తించి చికిత్స అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆసుపత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్ వెల్లడించారు. అనంతపురానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కుడిచెయ్యి, కుడికాలు బాగా బలహీనపడటంతో ఒక న్యూరాలజిస్టు వద్దకు వెళ్లారు. ఆ సమస్యను బ్రెయిన్ స్ట్రోక్ అని నిర్ధారించారు. ఎంఆర్ఐ తీస్తే ఒక రక్తనాళం బ్లాక్ అయినట్లు తెలిసింది. అందుకు కారణాలు ఏంటని మరింత లోతుగా పరీక్షలు చేయగా... గుండె నుంచి మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే అత్యంత కీలకమైన కెరోటిడ్ రక్తనాళం (ఇది మెడ దగ్గర ఉంటుంది) 99 శాతం బ్లాక్ అయినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇది చాలా సంక్లిష్టమైన సమస్య కావడంతో అక్కడినుంచి కిమ్స్ సవీరా ఆస్పత్రికి పంపారన్నారు. దానికి స్టెంట్ వేయడం మెరుగైన మార్గం కావడంతో, అందుకు అవసరమైన పరికరాలు అన్నింటినీ సేకరించి, కెరోటిడ్ ఆర్టెరీ స్టెంటింగ్ (సీఏఎస్) చేశామన్నారు. దీంతో మెదడుకు రక్త సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరించామన్నారు. అంతేగాకుండా రోగి పూర్తిగా కోలుకున్నట్లు వివరించారు. ఇదంతా కేవలం లోకల్ ఎనస్థీషియాతోనే చేశామన్నారు. రాయలసీమలోనే 99శాతం బ్లాక్ అయిన మెడ రక్తనాళానికి స్టెంట్ వేయడం ఇదే మొట్టమొదటి సారి అన్నారు. ఇదంతా ఆరోగ్యశ్రీ పథకంలోనే చేశామన్నారు.

గోడలపై పోస్టర్లు అతికిస్తే చర్యలు

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ పరిధిలోని డివైడర్లు, పబ్లిక్ స్థలాలు, గోడలపై పోస్టర్లు అతికిస్తే కఠిన చర్యలు తప్పవని అసిస్టెంట్ సిటీప్లానర్ బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై జరిమానాతోపాటు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా సెక్షన్ 420, 421, 596 ఒఎఫ్‌హెచ్ ఎంసి యాక్ట్ 1955 మేరకు చర్యలు చేపడతామన్నారు.

స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్‌గా ఏకాంబరం

పెద్దవడుగూరు : స్వచ్ఛ భారత్ మిషన్-2 మండల కోఆర్డినేటర్‌గా ఏకాంబరంను నియమించినట్లు ఎంపిడిఒ కుళాయిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 2018లో సాక్షరభారత్‌లో కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తించిన పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లి గ్రామానికి చెందిన ఏకాంబరంను గత ప్రభుత్వం తొలగించినట్లు తెలిపారు. అయితే సిఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు స్వచ్ఛభారత్ కో ఆర్డినేటర్‌ను నియమించినట్లు తెలిపారు. ఈమేరకు ఏకాంబరం స్థానిక ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, ఎంఇఒ రాముడును కలిసి జాయినింగ్ లేఖను అందజేశారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటి అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చాయని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, ఎంపిటిసి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ భవనంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ధనుంజయ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పథకం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అన్ని గ్రామాల్లో ప్రజలందరికీ సురక్షిత తాగనీరు అందించాలనే సదుద్దేశంతో ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఇందులో భాగంగా విడపనకల్లు మండల పరిధిలోని 19 గ్రామాలకు సంబంధించి రూ.17.56 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి సత్యాబాబు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

మండల రీసోర్స్ కోఆర్డినేటర్‌గా నాగేంద్ర

కుందుర్పి : మండల రీసోర్స్ కోఆర్డినేటర్‌గా పి నాగేంద్ర మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన సిఎం జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మండల రీసోర్స్ పర్సన్‌గా నియామకం చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు సిఎం కు కృతజ్ఞతలు తెలిపారు.

దండు శ్రీనివాసులుకు సన్మానం

శింగనమల : తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులును శ్రీ కోదండ రామస్వామి చెక్కభజన వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.కుళ్లాయప్ప ఆధ్వర్యంలో కళాకారులు మంగళవారం ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో వెన్నెల క్రిష్ణ, దాసరి గంగాధర్, చెక్కభజన సీనియర్ గురువు కుళ్లాయప్ప, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బండి పరుశురాం, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, డి.నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దండు శ్రీనివాసులును శ్రీ కోదండ రామస్వామి చెక్కభజన వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.కుళ్లాయప్ప, టిడిపి నాయకులు

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలి

ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్

ప్రజాశక్తి-ఉరవకొండ

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్, జిల్లా అసోసియేట్ జనరల్ సెక్రటరీ బి.హనుమప్ప డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండ జోన్ కార్యాలయంలో విడపనకల్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలు, 11వ పిఆర్‌సికి సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలన్నారు. అనంతరం విడపనకల్లు మండలం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గౌరవాధ్యక్షుడిగా నారాయణస్వామి, అధ్యక్షులుగా నజీర్‌అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా తలారి నరసింహులు, సహాధ్యక్షులుగా బాలముద్దన్న, నాగరాజు, సహ కార్యదర్శులుగా మల్లేష్, భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా శేషఫణిరాజు, మల్లేశప్ప, కిషోర్, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తహశీల్దార్ రమాదేవి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బూత్‌లెవెల్ ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణాలు పూర్తి చేయించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీమన్నారాయణ, హౌసింగ్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

14వ బెటాలియన్ తనిఖీ

గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎపిఎస్‌పి బెటాలియన్ రేంజ్ -3 డిఐజి సిహెచ్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని జంతలూరు వద్ద ఉన్న 14వ బెటాలియన్ కార్యాలయాన్ని ఎపిఎస్‌పి బెటాలియన్ రేంజ్ -3 డిఐజి సిహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్థానిక పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత పరేడ్ నిర్వహించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పి.జగదీష్, అడిషనల్ కమాండెంట్ డి.నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్ డి.వి.రమణమూర్తి, ఆర్ఐలు నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కర్నాటక మద్యం స్వాధీనం

మద్యం వివరాలను వెల్లడిస్తున్న సెబ్ సిఐ రవిచంద్ర

అనంతపురం క్రైం : మండలంలోని పి.యాలేరు క్రాస్ వద్ద మంగళ వారం కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.రవిచంద్ర తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సెబ్ ఎఎస్పీ జి.రామకృష్ణ ఆదేశాల మేరకు సీఐ రవిచంద్ర, సిబ్బందితో కలిసి ఆత్మకూరు మండలం పి.యాలేరు క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 23 బాక్సుల్లో ఉన్న 1872 కర్నాటక మద్యం టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆటోతోపాటు కూడేరు మండలం మరుట్ల-2 గ్రామానికి చెందిన వై.శివయ్య , రాయదుర్గానికి చెందిన వై.గోవిందప్పను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఆటోను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.11,140 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులోని బాట సుంకులమ్మ ఆలయ శివారులో మరుగుదొడ్ల నిర్మాణం విషయంలో మంగళవారం జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారులోని బాట సుంకులమ్మ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నూతన మరుగుదొడ్లను నిర్మించేందుకు ఆలయ కమిటీ నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళవారం జేసీబీతో గుంతలు తవ్వుతున్నారు. అయితే ఆలయ ఆవరణలో తనకు తెలియకుండా మరుగుదొడ్లు ఎలా నిర్మిస్తారని ఆలయ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. దీంతో వెంకటేశ్వర్లు, నారాయణస్వామి, అంజినప్ప, రామాంజనేయులు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. మాటామాటా పెరిగి వెంకటేశ్వర్లును నారాయణస్వామి, అంజినప్ప, రామాంజనేయులు కర్రలు, రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడ్డ వెంకటేశ్వర్లును వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : మండలంలోని రజాపురంలో ఉన్న అంబేద్కర్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉషారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 360కి పైగా మార్కులు వచ్చిన వారు మాత్రమే అర్హులన్నారు. సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైన వారు అనర్హులన్నారు. అర్హులైన వారు బుధవారం సాయంత్రంలోపు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉరవకొండ : ఈనెల 27వ తేదీన ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారుల సూచన మేరకు 2023లో పదవ తరగతి పరీక్షల్లో 360కు పైబడి మార్కులు సాధించిన రెగ్యులర్ విద్యార్థినులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 26న బుధవారం సాయంత్రం 4 గంటల లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నెలాఖరులోపు భూపంపిణీ

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని 102 మంది అర్హులైన రైతులకు భూపంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ బి.రాము తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి నెల నుంచి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ఇందులో 200 మంది దరఖాస్తు చేసుకోగా పరిశీలన అనంతరం 102 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు.

హోంగార్డు సస్పెన్షన్

అనంతపురం క్రైం : కంబదూరు పోలీసుస్టేషన్‌లో హోంగార్డ్‌గా పని చేస్తున్న కె.శివానందను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కె.శ్రీనివాసరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శివానంద పోలీసుస్టేషన్‌కి వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మహిళల పట్ల ఎవరు అసభ్యంగా వ్యవహరించినా, దురుసుగా ప్రవర్తించినా తప్పకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వినతి

సిఎం కార్యదర్శి ధనుంజయరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కాపు భారతి

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి మంజూరు చేసిన వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పనులు పూర్తి చేయించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి కాపు భారతి కోరారు. ఈమేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఆయా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

అనంతపురం కలెక్టరేట్ : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి జేఏసి ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ మంగళవారం విజయవంతమైంది. స్వచ్ఛందంగా కేజి నుంచి పీజీ వరకు విద్యా సంస్థలన్ని మూసివేసి బంద్‌కు సహకరించారు. బంద్ సందర్భంగా విద్యార్థి జేఏసి నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద హాస్టల్ విద్యార్థుల ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు గెరిటలతో తప్పెట్లు కొడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్ విద్యార్థులకు మేనమామగా ఉండి సేవ చేస్తానని నమ్మించి అధికారం చేపట్టారన్నారు. ఇస్తున్న పథకాలు కొందరికి వర్తిస్తుంటే మరికొందరికి అందడం లేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు ఇవ్వాలన్నారు. ఇంటర్ మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇచ్చి, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, బోధనేతర ఉద్యోగాలు, వర్శిటీలో బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఫీజు నియంత్రణ కమిటీ పటిష్టంగా పని చేసి కార్పొరేట్ ప్రయివేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించనిపక్షంలో మరో ఉద్యమానికి సిద్ధమౌతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి, ఏఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పృద్వీ, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ధనుంజయనాయుడు, లక్ష్మినారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు